క్లుప్తంగా

నేడు మండల సమావేశం

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ హరికృష్ణ తెలిపారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

ముగిసిన వర్క్‌షాపు

గండేపల్లి: ప్రస్తుత ఐటీ రంగంలో జరుగుతున్న అభివృద్ధి, నూతన టెక్నాలజీని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకు సాగాలని ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు నిర్వహించిన ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ అనే వర్క్ షాపు మంగళవారంతో ముగిసింది. ఏపీఎస్ఎస్‌డీసీకి చెందిన వి.అనిల్, ఐటీ విభాగాధిపతి ఎంవీ రాజేష్, డీన్ ఎస్.రమాశ్రీ, వర్క్‌షాపు కో కన్వీనర్ చిరంజీవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట

గోకవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం పక్షపాతి అని వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తరువాత బీసీలకు పెద్ద పీట వేశారని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. గోకవరంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు 18 స్థానాలకు గాను 14 స్థానాలు బీసీ, ఎస్సీలకు కేటాయించడం అభినందనీయని అందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలంటే బ్యాక్వార్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ అని మరోసారి రుజువు చేశారన్నారు. పార్టీ నాయకుడు సుంకర వీర బాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, చిట్టిబాబు, నాయకులు తోలేటి రాంప్రసాద్, శింబోతుల శ్రీను పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణకు సహకరించాలి

తుని: పట్టణాన్ని పరిశుభ్రతలో అగ్రగామిగా నిలిపేందుకు తడి, పొడి చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు మంగళవారం కోరారు. పట్టణంలోని 30 వార్డులకు చెందిన కుటుంబాలకు డస్ట్‌బిన్లను పూర్తి స్థాయిలో అందించామన్నారు. ఇంటి దగ్గర కిచెన్‌లో వినియోగించే తడి వస్తువులు, పొడి చెత్తను వేర్వేరుగా డస్ట్‌బిన్లలో వేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. కొందరు రోడ్లపై డంప్ చేస్తున్నారని, ఇటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్

గోకవరం: వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌లో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థినులకు పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించారు. రూరల్ హార్టీకల్చర్ వర్క్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా రంపఏడవరం పందిరి మామిడి తోటల్లో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ మంగళవారం విద్యార్థినులకు, స్థానిక రైతులకు తెగుళ్లు, వాటి నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి, వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థినులు పూజిత, ఇషిత, యోగ్యత, తేజస్విని, ప్రణతి, అనిత, బ్లెస్సీ, ఎస్తేర్, సౌమ్య, భవానీ, నీరజాక్షి పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

కోటనందూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం తాటాకిల్లు దగ్ధమైంది. రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతకొట్టాం ఎస్సీ కాలనీకి చెందిన దడాల రాజేశ్వరి రోజూ మాదిరిగా కూలి పనులకు వెళ్లింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆమె ఇంటి నుంచి మంటలు చెలరేగాయి. ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న తుని ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి వచ్చే సరికే పూర్తిగా కాలిబూడిదైంది. వీఆర్వో లక్ష్మణరావు కాలిన ఇంటిని పరిశీలించి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయి ఉండొచ్చని అంచనా వేశారు. ఈ అగ్ని ప్రమాదంలో ఇల్లు నిర్మించుకునేందుకు అప్పుగా తెచ్చుకున్న రూ.రెండు లక్షల నగదుతో పాటు రూ.లక్ష విలువ చేసే వస్తువులు కాలిపోయినట్టు గుర్తించారు. బాధిత కుటుంబాన్ని లోవదేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, సర్పంచ్ పసగడుగుల వరహాలు, ఉపసర్పంచ్ బొంగు గోపాలకృష్ణ పరామర్శించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శంఖవరం: కత్తిపూడి సీతారామ కళాశాలలో మంగళవారం వీడ్కోలు సభలో విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ వీరబాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఏడాది జరిగే పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. అధ్యాపకులు ఎం.అప్పారావు, వెంకటేశ్వరరావు, బాబులు, కృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మామిడిపై తెగుళ్ల దాడి

- సస్యరక్షణ చర్యలతోనే నివారణ సాధ్యం
- రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చిన హెచ్ఓ విజయలక్ష్మి

తుని రూరల్: మామిడి తోటలకు తెగుళ్లు ఆశించాయి. ఈ తెగుళ్లు, పురుగులను సకాలంలో నివారిస్తే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి రైతులకు సూచించారు. పూత, పిందె దశల్లో ఉన్న మామిడి తోటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండే విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి సలహాలు, సూచనలతో తెగుళ్లు, పురుగుల నివారణా చర్యలు చేపట్టాలన్నారు. ఎగుమతులకు అనువుగా మోతాదు మించకుండా పురుగు మందులు, ఎరువులను వినియోగించాలన్నారు. క్రిమి సంహారక మందుల అవశేషాలు లేకుండా జాగ్రత్త వహించాలని హెచ్ఓ అన్నారు. ఉద్యానశాఖ తుని సబ్ డివిజన్‌లో పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె మామిడి తోటలకు ఆశించిన తెగుళ్లు, పురుగుల నివారణకు సూచనలు చేశారు.

ఆకు మచ్చ తెగులు

బ్యాక్టీరియా వల్ల ఈ తెగులు ఆశిస్తుంది. తెగులు సోకిన ఆకులు నల్లని, గుండ్రని ఉబ్బెత్తు మచ్చలు ఏర్పాడతాయి. ఈ లక్షణాలు పిందెలు, కాయలపై కిరణజన్య సంయోగ క్రియకు అంతరాయం కలిగి కాయ పరిమాణం, నాణ్యత క్షీణిస్తుంది.

నివారణ : స్ట్రెప్టో సైక్లిన్ లేదా అగ్రిమైసిన్ ఒక గ్రాము మందును పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మసి తెగులు

మామిడి చెట్లను ఆశించు తేనె మంచు, పిండినల్లి కీటకాలు ఆకులు, కొమ్మల నుంచి రసాన్ని పీల్చి ఒకరకమైన తేనెవంటి తియ్యని జిగట పదార్థాన్ని విసర్జిస్తాయి. ఈ పదార్థంపై నల్లటి మసి తెగులు వృద్ధి చెంది, వర్షాకాలంలో ఎక్కువ వ్యాప్తి చెందుతుంది.

నివారణ : మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా డైమిథోయేట్ రెండు మిల్లీలీటర్లు చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

బంక తెగులు

ముదురు మామిడితోటల కొమ్మలు ఎండిపోవడం, పగుళ్లు రావడం, ఆకులు జీవం కోల్పోయి బంక కారి క్రమేపి తోటలు ఎండిపోతాయి.

నివారణ : ఎండిన కొమ్మలను కత్తిరించాలి. చెట్ల మొదళ్లలో రెండు కిలోల మాగిన పశువుల ఎరువును ట్రికోటేర్మావిరిడి ఫార్ములలో కలిపి వేసుకోవాలి. బంక కారే కొమ్మలపై లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజిం రెండు నుంచి మూడు సార్లు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

తామర పురుగు

లేత ఆకుల అడుగు భాగాల్లో గుంపులుగా చేరి రసాన్ని పీల్చి ఆకులకు కింద ముడత కలిగిస్తాయి. దీనివల్ల చిగురాకులు చాలా చిన్నవిగా ఉండి రాలిపోతాయి. పిందె ఏర్పాడే దశలో కాయపై చర్మాన్ని గోకి బయటకు వచ్చిన రసాన్ని పీల్చివేస్తాయి. కాయలు నాణ్యత కోల్పోతాయి.

నివారణ : లీటరు నీటికి ఒక గ్రాము ఎసిఫేట్ లేదా ఫిప్రొనిల్ రెండు మిల్లీ లీటర్లు లేదా థీయోమిథాక్సామ్ 0.3 గ్రాముల మందు కలిపి పిచికారీ చేయాలి.



లోవకొత్తూరులో తెగులు సోకిన మామిడి తోట

పండు ఈగ

లేత గోదుమ రంగు రెక్కలు కలిగిన పండు ఈగ మామిడి కాయపై పొరలో గుడ్లు పెడతాయి. ఒక్కరోజులు గుడ్లు పగిలి లార్వాలు ఎదుగుతాయి. మాగీమాగని కాయల్లో గుజ్జును తినడంతో కాయలు నేలరాలిపోయి నష్టాన్ని కలిగిస్తాయి.

నివారణ : మోనో క్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఫెనథీయాన్ ఒక మిల్లీ లీటరు లేదా మిథైల్ డెమటాల్ రెండు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రాలిన పండ్లను ఏరి నాశనం చేయాలి. ప్రతి 20 చెట్ల మధ్య ఆకర్షణకు ఎర్ర పళ్లెం ఉంచాలి. అందులో పది మిల్లీ లీటర్ల మిథైల్ యూజనల్‌తో పాటు 20 మిల్లీ లీటర్ల మాలథీయాన్ మందును 200 మిల్లీ లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని ఒక్కొక్క ఎర్ర పళ్లెంలో నింపాలి. ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది లింగాకర్షక బుట్లను ఏర్పాటు చేయడం వల్ల మగ పండు ఈగను నియంత్రించవచ్చు.



టి.వెంకటాపురంలో పిందెలతో ఉన్న మామిడితోట

తేనెమంచు పురుగు

గోదుమరంగు గల తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, చిగుళ్లు, పూల కాడలు, పూలు, పిందెల నుంచి రసాన్ని పీల్చడం వల్ల ఆయా భాగాల్లో పెరుగుదల నిలిచిపోయి వడిలి ఎండిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తేనెవంటి జిగురుపై మసి తెగులు వృద్ధి చెందుతుంది.

నివారణ : పూత వికసించే ముందు మొదటిసారి 50 శాతం కార్బిరిల్ మందు మూడు గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 20-30 రోజుల మధ్య లేదా ఐదు శాతం ఫలదీకరణ తర్వాతగాని మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అధికంగా ఆశించినప్పుడు థయోమిసాక్సామ్ 0.3 గ్రాముల లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాయపుచ్చు పురుగు

గులాబి రంగు చార కలిగిన తెల్లటి లద్దెపురుగు కాయ అడుగున రంధ్రం చేసి తోలు, కండను తిని సొరంగాన్ని ఏర్పర్చడం వల్ల పుచ్చు వస్తుంది.

నివారణ : కోత తర్వాత ఎండుకొమ్మలు, కాండం పగుళ్లలో స్తబ్ధితగా ఉన్న గొంగళి పురుగులను నాశనం చేయాలి. ఆపై వేపగింజల కషాయం ఐదు శాతం, వేపనూనే ఒక శాతం కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

ఆకు జల్లెడ గూడు పురుగు

ఆకులను గూడు కట్టి ఆకులలో పత్రహరితాన్ని తింటూ ఈనెలను మిగులుస్తాయి. ఈ పురుగులు ఆశించినప్పుడు పూత సరిగా రాదు. దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ : ఆకు గూళ్లను కత్తిరించి కాల్చివేయాలి. రెండు మిల్లీ లీటర్ల క్వినాల్ ఫాసే మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పక్షి కన్ను తెగులు

లేత ఆకులు, లేత రెమ్మలు, పూలకాడలు, కాయల మీద తెగులు మచ్చలు కనిపిస్తాయి. వర్షాకాలంలో ఆకులమీద లేత చిగుళ్లమీద అండాకారంలోగాని, నిర్దిష్టమైన ఆకారం లేకుండ బూడిద రంగు మచ్చలు వ్యాపించి రెమ్మలు ఎండిపోతాయి.

నివారణ : మూడు గ్రాములు కాపర్‌ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజిం లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. పూత, కాయ సమయంలో థయోఫెనేట్ మిథైల్ ఒక గ్రాము లేదా క్లోరోథాలోనిర్ రెండు గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- జగ్గంపేట మండల సర్వసభ్య సమావేశం

కిర్లంపూడి: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జగ్గంపేట శాసన సభ్యులు జ్యోతుల చంటిబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే మండల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమైందని ఆయన అన్నారు. మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చొరవ చూపాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీపీ రవి శాఖల వారీగా సాధించిన ప్రగతిని సమీక్షించి ప్రజాప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ మేరకు ప్రజాప్రతినిధుల నుంచి విద్యుత్, అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణాలతో పాటు పలు సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తోట గాంధీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎస్సార్ మండల పార్టీ అధ్యక్షుడు దొమాల గంగాధర్, సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, వైఎంఎస్‌సీ చైర్మన్ పెంటకోట నాగబాబు, తోట విష్ణు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు బిళ్లకుర్తి నాగమణి, మొల్లేటి సరస్వతీ, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, భూపాలపట్నం ప్రసాద్, సంఘన వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, తహసీల్దార్ కేవీ మాధవరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

పాడిరైతుల అభివృద్ధికి కృషి

కోటనందూరు: పాడిరైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మంగళవారం ఎస్సార్‌పేటలో కృత్రిమ గర్భధారణ లేగదూడల ప్రదర్శనను పశుసంవర్ధక శాఖ ఏడీఏ వి.శ్రీధర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ పాడిరైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక ప్రోత్సహాలు అందిస్తుందన్నారు. పాడిరైతులంతా ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ సాధారణ గేదెల ద్వారా పుట్టిన దూడలతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో కృత్రిమ గర్భధారణను ప్రోత్సహిస్తున్నామన్నారు. పాడిపరిశ్రమను మరింత బలోపేతం చేయాలంటే దూడల పెంపకం అత్యంత కీలకమన్నారు. దూడల ప్రదర్శనలో విజేతలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు చేతుల మీదుగా బహుమతులు అందజేసారు. వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి గోవిందు, రుత్తల జోగిరాజు పాల్గొన్నారు.



దూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

రేపు కంటి వైద్య శిబిరం

జగ్గంపేట: స్థానిక ఆంధ్రప్రదేశ్ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రికి చెందిన గౌతమీ నేత్రాలయం సహకారంతో జగ్గంపేటలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆ యూనియన్ అధ్యక్షుడు వెంకట శాస్త్రి తెలిపారు. జగ్గంపేట గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఏలేశ్వరం: శాసన మండలి ఎన్నికల్లో అత్యధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించడంతో సీఎం జగన్ చిత్రపటానికి పట్టణంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిపై సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ బీసీల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నారన్నారు. శాసన మండలి ఎన్నికల్లో 18 స్థానాలకు బీసీ, ఎస్టీ, ఎస్సీలకు 14 స్థానాలు కల్పించిన సీఎం జగన్‌కు ఆయా వర్గాలు రుణపడి ఉంటాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర రాంబాబు, వాగు బలరామ్, కాకాడ నాగేశ్వరరావు, యండగండి నాగబాబు, కోనాల వెంకటరమణ, దాకమర్రి లోవరాజు, మసిరపు నాగేశ్వరరావు, సామంతుల రామన్న, బోద చిరంజీవిరావు పాల్గొన్నారు.

కోటనందూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మిడి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ ఖరారు చేయడంపై ఎమ్మార్పీఎస్ మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఆ మేరకు మంగళవారం కొత్తకొట్టాంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు మోర్త మాణిక్యం ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు, జిల్లా వర్కింగ్ కమిటీ చైర్మన్ ఆరుగుల మోషే మాట్లాడుతూ మాదిగలకు ఎంతో ప్రాధాన్యత కల్పించిన సీఎం జగన్‌ను మాదిగలంతా చిరకాలం గుర్తు పెట్టుకుంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలంతా ఏకతాటిపైకి వచ్చే సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎంఆర్పీఎస్ కార్యకర్తలు తొమ్మండ్ర లోవరాజు, మసురుపాము చిన్న, కాపారపు శేఖర్, ఆరుగుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: బహుజనులపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ఎనలేని ప్రేమ ఉందని ఎమ్మెల్సీ టిక్కెట్ కేటాయింపుతో విషయం మరోసారి రుజువైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాసన మండలికి 14 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉండడం బహుజనులకు సీఎం జగన్ ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు. ఆయనకు బహుజనుల తరుపున కృతజ్ఞతలు చెపుతున్నామని అన్నారు.



ఏలేశ్వరంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

660 మందికి కంటి పరీక్షలు

కిర్లంపూడి: అంజు కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో 660 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం స్థానిక విజ్ఞాన భారత ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కళ్లజోళ్లు అవసరంగా గుర్తించినట్టు వైద్యులు శ్రద్ధ, విమి తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బాదంపూడి సూర్యనారాయణమూర్తి, పాఠశాల హెచ్ఎం గాడి శ్రీనివాసరావు, పోకల శివశంఖర ప్రసాద్

ఘనంగా మాతృభాషా దినోత్సవం

తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృ భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్, ఇతర అధ్యాపకులు మాతృభాషా ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.జాన్‌కిరణ్, పి.మహాలక్ష్మీనాయుడు, కృష్ణమోహన్, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.



పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎంవీకే మెహర్

డిగ్రీ కళాశాలలో..

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇ.చంద్రనాయుడు ఆధ్వర్యంలో తెలుగు భాష విశిష్టత అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు.

ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరంలో జరిగిన స్టేట్ లెవల్ కామర్స్ ఫెస్టు(కామర్సియా-2క23)లో జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలలో తమ ప్రతిభను చాటారు. వారిని ప్రిన్సిపాల్ చంద్రనాయుడు అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం ఎంపీయూపీ స్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాతృభాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

నాడు-నేడు పనుల్లో పారదర్శకత పాటించండి

- విద్య, మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ లక్ష్మారెడ్డి
- గ్రామాల్లో నాడు-నేడు పనుల పరిశీలన

తుని రూరల్: మనబడి నాడు-నేడు పనుల్లో పారదర్శకత పాటించాలని ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూడీసీ) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తుని మండలం వి.కొత్తూరు కేజీబీవీ, ఎస్.అన్నవరం, రాజుపేట, తుని పట్టణం సీతారాంపురం, బ్యాంకు కాలనీల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. జిల్లా పరిషత్, మున్సిపల్ హైస్కూళ్లలో జరుగుతున్న మొదటి, రెండు విడతల నాడు-నేడు పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు, జరిగిన పనులు, ఎస్టిమేట్లు, ఖర్చు చేసిన మొత్తాల రికార్డులను ఆరా తీశారు. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ సరఫరా చేసిన మెటీరియల్ ఎంత వరకు చేరింది, ఇంకా ఎంత చేరాల్సి ఉంది హెచ్ఎంలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల విద్య వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్‌పీలతో సమావేశమయ్యారు. పర్యటనలో గమనించిన, గుర్తించిన అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. లోటుపాట్లు, పరిష్కార మార్గాలను సూచించారు. వర్క్ ఎస్టిమెంట్లు, ఎం.బుక్‌ల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఎంఈఓ పరవాడ గీతాదేవి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



ఎస్.అన్నవరంలో నాడు-నేడు పనులు పరిశీలించి, ఎంఈఓను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఈఈ లక్ష్మారెడ్డి

తొండంగి మండలంలో...

తొండంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని జరుగుతున్న నాడు-నేడు రెండో విడత పనులను ఏపీడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మారెడ్డి, ఇతర అధికారులు బృందం మంగళవారం పరిశీలించింది. తొండంగి ఎస్సీకాలనీలో ఎంపీపీ స్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలించారు. భవనం నిర్మాణ పనులు సక్రమంగా లేకపోవడంతోపాటు హెచ్ఎం లలితకుమారి వద్ద నాడు-నేడు పనుల మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికంగా నగదును తన వద్ద ఉంచుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొత్తపాకలు ఎంపీపీ స్కూలు, పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూలలో కూడా నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్‌బాబ్జీ, ఇతర సిబ్బంది ఉన్నారు.